ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 5 మార్చి 2025



కందిపోవాల్సిందే...!

జిల్లాలో రైతులు పండించిన కంది పంటను అమ్ముకునేందుకు అపసోపాలు పడుతున్నారు. అప్పులు చేసి ఆరుగాలం కష్టపడి సాగుచేస్తే వచ్చిన అరకొర దిగుబడులను.. అమ్ముకుందామంటే ప్రభుత్వ నిబంధనలతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పేరుకేమో మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని అధికారులు గొప్పలు చెబుతున్నారు. వీటిని ప్రారంభించి 20 రోజులు అయినా చెప్పుకునే స్థాయిలో కొనుగోళ్లు సాగలేదు. దీనికి కారణం కందుల కొనుగోళ్లలో ప్రభుత్వం విధించిన నిబంధనలే అని రైతులు పేర్కొంటున్నారు.



తొండూరులో ఓ రైతు ఇంటిలో నిల్వ ఉన్న కందుల బస్తాలు

- మద్దతు ధరతో కందులు కొంటామంటున్న ప్రభుత్వం
- ప్రభుత్వ నిబంధనలతో రైతులకు ముచ్చెమటలు
- ఎనిమిది కేంద్రాలున్నా.. కొనుగోలు అంతంతమాత్రమే

పులివెందుల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 50వేల నుంచి 60వేల ఎకరాల్లో కంది సాగుచేశారు. ముఖ్యంగా వర్షాధారం కింద జూలై ఆగస్టు మాసాల్లో పంట సాగైంది. పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, బద్వేలు నియోజకవర్గాల్లో కందిపంట విస్తారంగా సాగైంది. నవంబరు, డిసెంబరు మాసాల్లో పూత దశలో వరుస తుఫాన్లతో పంట దిగుబడి బాగా తగ్గింది. ఎకరాకు కేవలం క్వింటా నుంచి నాలుగు క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. వచ్చిన ఆ కాస్తా దిగుబడి అయినా అమ్ముదామనుకుంటే రైతుకు ముచ్చెమటలు పడుతున్నాయి. గత ఏడాది పంట కోత ప్రారంభం నుంచే క్వింటా రూ.9వేలతో కొన్నారు. పంట కోతలు పూర్తయ్యే సమయానికి క్వింటా రూ.10వేల పైచిలుకు పలికింది. ఈ ఏడాది రేటు చూస్తే దయనీయంగా ఉంది.

ఎవరికి అమ్మాలో అంతుబట్టని వైనం

గత ఏడాది సాగైన కంది ఈ ఏడాది జనవరి ఫిబ్రవరిలో దిగుబడులు వచ్చాయి. తాము పండించిన కందులను ఎవరికి అమ్మాలో అంతుబట్టడం లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగుబడులులేవు.. ధరలూ అధ్వాన్నంగా ఉన్నాయని అంటున్నారు. ఈ ఏడాది పంటకోత సమయంలో బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు రూ.6వేల నుంచి రూ.6,500తో రైతుల వద్ద కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం క్వింటా కందులు రూ.7,550తో కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో రైతులకు కాస్త ఊరట లభించింది. కానీ ప్రభుత్వ నిబంధనలు చూసి పంటను ఎవరికి అమ్మాలో రైతులకు అంతుపట్టడం లేదు.

ఇవీ నిబంధనలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలంటే కందుల్లో తేమ 12శాతం మించరాదు. కేవలం 2శాతం మాత్రమే వ్యర్థాలు ఉండాలి. 3శాతానికి మించి ఇతర గింజలు ఉండకూడదు. ఈ నిబంధనలతో రైతులు అయోమయంలో పడిపోయారు. ఇంటివద్ద నుంచి కొనుగోలు కేంద్రాలకు కందులను తరలించేందుకు, అక్కడ జల్లివేసేందుకు, వాటిని కడపకు తరలించేందుకు లారీల్లో నింపేవరకు అన్ని ఖర్చులు రైతే భరించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే అక్కడ కందులను జల్లెడ వేయడం ఓ పెద్ద సమస్యగా మారింది. కందులు కొనుగోలు చేసే కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన జల్లెడలో మొదటి రకం మినహా మిగిలనవన్నీ వ్యర్థాల్లో బయటకు వెళ్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ నిబంధనలతో అమ్ముకుంటే తాము మరింత నష్టపోతామని అంటున్నారు. కందుల కొనుగోలులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధనలు రైతులకంటే వ్యాపారులకు లాభం చేకూర్చేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిబంధనలను సడలించాలని వారు కోరుతున్నారు.

ఎనిమిది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, ముద్దనూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, పోరుమామిళ్లలో.. మొత్తం 8 చోట్ల ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. వీటిలో మార్క్‌ఫెడ్ ద్వారా కందులు కొనుగోలు చేస్తున్నామని దాదాపు 20రోజుల క్రితమే ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు కొనుగోళ్లు జమ్మలమడుగులో మొదట ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు రైతుల నుంచి కొన్నది నామమాత్రమే. మార్క్‌ఫెడ్ అధికారులే జిల్లాలో దాదాపు 9,400 టన్నుల కందులు రైతుల వద్ద ఉన్నట్లు గుర్తించామని ప్రకటించారు. వాస్తవానికి 15వేల టన్నుల దిగుబడులు ఉంటాయని రైతులు అంటున్నారు. కొనుగోళ్లు ఇంత మందకొడిగా ఉంటే రైతుల వద్ద ఉన్న సరుకంతా కొనడానికి ఎంత సమయం పడుతుందో..? ఏదిఏమైనా రైతుకు దిగుబడులు అంతంత మ్రామే ఉన్నప్పుడు కొనుగోలులో నిబంధనలు సరళం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



తొండూరులోని కొనుగోలు కేంద్రంలో కందులను జల్లిస్తున్న దృశ్యం

నాణ్యత కలిగిన కందులనే దించుకోండి

- గిడ్డంగుల్లో కందులను పరిశీలించిన ఆర్డీవో



గిడ్డంగులకు వచ్చిన కందులను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతుల నుంచి మద్దతు ధరతో నాణ్యత ప్రమాణాలు కలిగిన కందులను మాత్రమే కొనుగోలు చేసి గిడ్డంగుల్లో భద్రపరచాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ గిడ్డంగుల అధికారులను ఆదేశించారు. స్థానిక వైఎంఆర్ కాలనీలో ఉన్న ఏపీ గిడ్డంగుల్లో నాలుగు రోజులుగా అనంతపురం నుంచి వచ్చిన కందుల లారీ లోడులను దించుకోలేదని డ్రైవర్లు ఆందోళన చేసిన నేపథ్యంలో మంగళవారం ఆర్డీవో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పరిమళ జ్యోతి గిడ్డంగులకు వచ్చిన లారీల్లోని కందులను పరిశీలించారు. సత్యసాయి జిల్లాలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ఈ కందులలో నాణ్యతా ప్రమాణాలు ఎందుకు లేవనేది ఆ జిల్లా మార్కెఫెడ్ అధికారులు వచ్చి పరిశీలిస్తారన్నారు. కందుల లోడ్లు ఏమైనా మార్చి తీసుకొచ్చారా దళారులు ఏమైనా ఈ వ్యవహారంలో ఉన్నారా అని విచారించాలని ఆర్డీవో ఆదేశించారు.

కలెక్టర్ కార్యాలయానికి రండి

- ఇరువర్గాలను ఆదేశించిన డీఎస్పీ, ఆర్డీవో

చెన్నూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఖిల్లా మసీదులో పంచాయతీ అనుమతి లేకుండా స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని చెన్నూరు హిందూ ఐక్యవేదిక నేతలు ఆరోపిస్తుండగా.. తాము అన్ని అనుమతుల తోనే నిర్మాణాలు చేపడుతున్నామని ఖిల్లా మసీదు కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారం చెన్నూరులో ఉద్రిక్తతకు దారితీసేలా మారడంతో ఇక్కడకు వచ్చి పరిశీలించిన ఆర్డీవో, డీఎస్పీలు ఇరువర్గాలను కడప కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. వివరాలు ఇలా..

చెన్నూరులో నాగేశ్వరాలయం, ఖిల్లా మసీదు ఎదురెదురుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మసీదు కమిటీవారు పంచాయతీ అనుమతి లేకుండా స్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ చెన్నూరు హిందూ ఐక్యవేదిక నేతలు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఐక్యవేదిక అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కె.విజయభాస్కర్‌రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఖిల్లా మసీదులో కట్టే కట్టడాలకు పంచాయతీ అనుమతి లేదని వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందించారు.



ఖిల్లా మసీదు ప్రాంతం వద్ద పరిశీలిస్తున్న కడప ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

కాగా.. తాము అన్ని అనుమతులతోనే నిర్మాణాలు చేపడుతున్నామని ఖిల్లా మసీదు కమిటీ సభ్యులు షఫి, ఫసీర్ అహ్మద్ తెలిపారు. వీరు పరస్పరం చేసుకుంటున్న ఆరోపణలపై తహశీల్దారు జిల్లా పోలీసు శాఖకు, రెవెన్యూశాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో డీఎస్పీలు వెంకటేశ్వరరావు, షేక్ అబ్దుల్‌కరీంతో పాటు ఆర్డీవో జాన్ ఎర్విన్ చెన్నూరు వచ్చారు. ఖిల్లా మసీదు వద్ద జరిగే గదుల నిర్మాణాన్ని పరిశీలించారు. ఇరువర్గాలను తహశీల్దారు కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. అయితే ఎవరికి వారు తమ వాదనలు వినిపించారు. దీంతో ఇరువర్గాలను కలెక్టర్ కార్యాలయానికి రావాలని చెప్పి డీఎస్పీలు, ఆర్డీవో వెళ్లిపోయారు. కాగా.. అక్కడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండడంతో కడప నుంచి ప్రత్యేక పోలీసు దళాన్ని రప్పించి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐలు సీతారామిరెడ్డి, శివరాముడుతో పాటు ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి పోలీసు సిబ్బంది మధ్యాహ్నం 3 వరకు అక్కడే ఉన్నారు.

సజ్జల ఎస్టేట్‌లో..
అటవీ భూముల పరిశీలన



సజ్జల ఎస్టేట్‌లో ఆక్రమణలో ఉన్న అటవీ భూములను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

సీకేదిన్నె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలో సజ్జల కుటుంబీకులు ఆక్రమించి సాగు చేసిన అటవీ భూములను జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మంగళవారం పరిశీలించారు. 'అటవీ భూముల్లో సజ్జల సామ్రాజ్యం' పేరిట గత నెల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో అధికారులు ఆ భూముల్లో సర్వే చేస్తున్నారు. సజ్జల కుటుంబీకుల ఆధీనంలో 55 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు గుర్తించడంతో సర్వే పక్కాగా నిర్వహించి వారి ఆక్రమణలో ఎంత భూమి ఉందో నిగ్గు తేల్చేందుకు అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. మండలంలోని 1599, 1600/1, 2, 1601/1, 1ఏ, 2ఏతో పాటు ఇతర సర్వే నంబర్లలోని అటవీ భూములు ఆక్రమించినట్లు గతంలో చేపట్టిన సర్వేలో తేలింది. అయితే ఇందులో తమ శాఖ భూములు లేవని, అటవీ శాఖ వాదిస్తుండడంతో.. మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సజ్జల ఎస్టేట్‌కు వెళ్లి అటవీ భూములను పరిశీలించారు. రెవెన్యూ శాఖవారు జేసీకి మ్యాపులు, రికార్డులు చూపించి ఇవన్నీ అటవీ భూములేనని వివరించినట్లు తెలిసింది. అక్కడ భూముల సర్వే నంబరు రాళ్లు ఎక్కడెక్కడ ఉంది రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు ఆమెకు చూపించారు. ఈ నేపథ్యంలో ఆమె అటవీశాఖ భూములను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, తహశీల్దార్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో సీమకు తీరని అన్యాయం

- ధ్వజమెత్తిన తులసిరెడ్డి



కడప మారుతీనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమకు తీరని అన్యాయం చేసిందని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి అన్నారు. జనాభా ప్రాతిపదికన కానీ, వైశాల్య ప్రాతిపదికన కానీ 42శాతం కేటాయించాల్సిన బడ్జెట్‌లో కేవలం 6 శాతం కేటాయించడంతో ఇది మోసకారి బడ్జెట్‌గా తేలిపోయిందన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'రాష్ట్ర బడ్జెట్- రాయసీమ ఆకాంక్షలు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రకమైన అరకొర బడ్జెట్ ద్వారా మరో 50 ఏళ్లు అయినా రాయలసీమలో ఏ ఒక్క ప్రాజెక్టు కానీ, ఏ ఒక్క పరిశ్రమ కానీ పూర్తికాదన్నారు. సీమ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే కనీసం రూ.40 వేల కోట్లు అవసరమౌతాయన్నారు. అలాంటిది కేవలం రూ.11వేల కోట్లను రాష్ట్రమంతా కేటాయిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధానమైన సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయకుండా విస్మరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. అనంతరం ఆర్సీపీ రాష్ట్ర విస్తృత సమావేశంలో ఆ పార్టీ భవిష్యత్ కర్తవ్యాలను చర్చించారు. ఈనెల 15న రాయలసీమ వ్యాప్తంగా ఏపీజీబీ తరలింపుపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాధర్, అక్బర్, ఆంజనేయులు, మున్నా, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతాచర్యలు కఠినతరం చేయాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణ భద్రత కోసం చేపడుతున్న రోడ్డు భద్రతా చర్యల ఆంక్షలను కఠినతరం చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాల్లో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్‌తో పాటు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, కమిటీ మెంబరు కన్వీనర్ మరియు ఇన్‌చార్జి డీటీసీ కె.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాలతోనే చనిపోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను కఠినతరం చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్, పెట్రోల్ బంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామాగ్రి రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

- రెవెన్యూ, అటవీ శాఖల నడుమ భూవివాదాల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ రూం హాల్లో అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయ సమీక్ష సమావేశం డీఎఫ్ఓ వినీత్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ నిర్వహించారు.
- మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, రవాణా అరికట్టడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌తో కలసి జిల్లా యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణాను అరి కట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మెడికల్ షాపు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఎంచుక్కా.. సిట్టింగ్..!



- మద్యం దుకాణాల వద్దే తాగుడు
- పోలీస్, ఎక్సైజ్‌శాఖ ప్రేక్షక పాత్ర

బద్వేలు టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల పక్కనే దర్జాగా పర్మినెంట్ రూములు ఏర్పాటు చేసి మందుబాబులకు సిట్టింగ్ సదుపాయాలు కల్పించారు. మరికొన్నిచోట్ల కూల్‌డ్రింక్ షాపుల పేరిట బోర్డులు పెట్టి, లోపల మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఇవన్నీ అధికారులు, నేతల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న వైసీపీ నాయకులతో కొంతమంది కూటమి నేతలు కుమ్మక్కై ఈ వ్యవహారం సాగిస్తున్నారని సమాచారం. దీంతో మద్యం దుకాణాలు కాస్త బార్లుగా మారిపోయాయి.

బద్వేలు నియోజకవర్గంలో 16 మద్యం దుకాణాలు ఉన్నాయి. దాదాపు అన్ని దుకాణాల వద్దా దర్జాగా పర్మినెంట్ రూములు ఏర్పాటుచేసుకుని మద్యం తాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అయితే మద్యం దుకాణం వద్ద మద్యం సేవించరాదు. అక్కడ మద్యాన్ని కొనుక్కొని బయటకు వెళ్లి తాగాల్సిందే. అయితే బద్వేలులో మద్యం దుకాణదారులు నిబంధనలను పాటించడంలేదు. మద్యంషాపులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన చోట కూర్చోబెట్టి తాగిస్తున్నారు. వాటర్ బాటిల్స్, ప్యాకెట్లు, తినుబండారాలు సైతం అక్కడే విక్రయిస్తున్నారు.



బద్వేలు పట్టణంలో మద్యం దుకాణం వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులు అధిక సంపాదనకు ఆశపడి నిబంధనలను పక్కనపెట్టి పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేయించారు. పల్లెల్లోనే కాకుండా, మున్సిపాలిటీల్లో, వార్డుల్లో కూడా బెల్టుషాపులు ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో వాడ వాడలా మద్యం గుప్పుమంటోంది. నిబంధనలను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా మద్యం విక్రయిస్తున్నా, ఎక్సైజ్ మరియు పోలీస్‌శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సిట్టింగ్ ఏర్పాటు చేసిన మద్యం షాపులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

మద్యం దుకాణదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. మద్యం షాపుల వారికి పర్మిట్ రూము ఏర్పాటుకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. మద్యం షాపుల్లో మద్యం సేవించకూడదు. అలా సేవిస్తే మద్యం షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- సీతారామిరెడ్డి ఎక్సైజ్ సీఐ, బద్వేలు

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సెహరీ (గురువారం ఉదయం)
కడప	6.29	5.14
ప్రొద్దుటూరు	6.30	5.18

కలెక్టరేట్‌లో
మానసిక రోగి హల్‌చల్
- సెక్యూరిటీ సిబ్బందిపై దాడి
7

గండికోట మునకకు
రూ.500 కోట్లు ఇవ్వాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆది
7

ఆర్టీసీ బస్సు బోల్తా..
15 మందికి గాయాలు
7

ఉపవాసం.. ఆరోగ్యదాయకం

● శారీరక, మానసిక ఉపయోగం ● ఇహపర ప్రయోజనం



పీలేరు అక్సా మసీదులో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఉపవాసం (రోజా). రంజాన్ మాసానికి మాత్రమే ప్రత్యేకమైన, ప్రధానమైన ఆరాధన ఉపవాసం. ఏడాదిలోని 11 నెలలు తమకిష్టమైన రీతిలో గడిపే ముస్లింలు రంజాన్ మాసంలో మాత్రం విధిగా ఉపవాసాలు పాటిస్తారు. కలీమా, నమాజు, రోజా, జకాత్, హజ్, అనేవి ఇస్లాం ధర్మానికి మూలస్తంభాలు. వాటిలో నమాజ్ తర్వాత అత్యంత ప్రాధాన్యత కలిగినది రోజా. జకాత్ (పేదలకు దానం చేయడం), హజ్ (పవిత్ర మక్కా యాత్ర) ఆర్థిక స్థోమత ఉన్న వారు మాత్రమే చేయగలిగినది. నమాజు, రోజా మాత్రం పేద, ధనిక తేడా లేకుండా అందరూ ఆచరించగలిగిన ధర్మం. ఉపవాసాలు పాటించడం వల్ల ఇహ, పర ప్రయోజనాలు న్నాయని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రంజాన్ మాసపు ఉపవాసాలు పాటించాలని పెద్దలు చెబుతున్నారు.

ఉపవాస దినాల్లో పాటించాల్సిన నియమాలు

- ఉపవాసాలు ఉన్న వారు విధిగా ఐదు పూటలా నమాజు చేయాలి.
- రాత్రి తరావీహ్ నమాజు చేయాలి.
- చాడీలు, అబద్ధాలు చెప్పకూడదు.
- తగవులు, మనస్పర్థలకు దూరంగా ఉండాలి.
- ఉపవాసం ప్రారంభించేటప్పుడు (సెహర్), సాయంత్రం ఉపవాస దీక్ష విరమించేటప్పుడు (ఇఫ్తార్) దీక్షా సంకల్పం (నియ్యత్) పఠించాలి.
- పాపిష్టి సొమ్ము అని తెలిసిన తరువాత దానిని భుజించకూడదు.

ఆకలి బాధ గ్రహించేందుకు.....

పేదల ఆకలి బాధ అందరికీ తెలియాలన్న లక్ష్యంతో అల్లాహ్ రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటించాలని ఆదేశించారని మహమ్మద్ ప్రవక్త (స.అ.సం) తన హదీసుల్లో తెలియజేశారు. ఆకలి బాధను గ్రహించిన వారికి తమ పొరుగు వారి బాధలను సులభంగా అర్థం చేసుకుని వారికి సహాయపడే గుణం అలవడుతుందన్నది ఉపవాస ప్రయోజనాల్లో ఒకటి. ఆరోగ్యంగా ఉంటూ రంజాన్ మాసపు పవిత్రత పొందలేని వాడు నిజంగా దురదృష్టవంతుడని ఆయన తెలిపారు. ఏడాదికి 11 నెలలు సొంతానికి, రంజాన్ నెల మాత్రం అల్లాహ్ ఇబాదత్ (దైవ చింతన) కోసం ఏర్పాటైనట్లు మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) పేర్కొన్నారు. ఉపవాసాలు ఉన్న వారికి అల్లాహ్ అనుగ్రహంతోపాటు, సాధారణ రోజుల కంటే అధిక ఆహారం లభిస్తుందని ఆయన తెలిపారు. దైవ చింతన తప్ప ప్రాపంచిక విషయాలపై దృష్టి మరల్చకుండా, చాడీలు, అబద్ధాలకు దూరంగా ఉంటూ ఐదు పూటలా నమాజు పాటిస్తూ ధర్మనిష్ఠ, నిష్కల్మష మనసుతో ఉపవాసాలు చేస్తే మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

ఉపవాసంతో లాభాలు..

- ఉపవాసాలతో జీర్ణాశయ వ్యవస్థ ప్రక్షాళన అవుతుంది.
- శరీరంలో గ్లూకోజ్ నిల్వలపై నియంత్రణ,ఇన్సులిన్ గ్రహించేశక్తి పెరుగుతుంది.
- రోగాల నుంచి సహజ రక్షణ లభిస్తుంది.
- చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- హైబీపీ దూరమవుతుంది.
- ఆకలిపై అదుపు పెరుగుతుంది.
- నిగ్రహ శక్తి పెరుగుతుంది. .

మూడు భాగాలుగా ఉపవాసాలు..

రంజాన్ మాసపు 30 ఉపవాసాలు మూడు భాగాలుగా విభజితమయ్యాయి. మొదటి పది ఉపవాసాలను అల్లాహ్ కరుణను (రెహమత్) అభ్యర్థించేవిగా, రెండవ పది ఉపవాసాలను తాము చేసిన పాపాల నుంచి క్షమాపణ కోరడం, మూడవ పది ఉపవాసాలను దైవానుగ్రహం కోరేవిగా విభజించారు. ఆయా రోజుల్లో ఆయా ప్రార్థనలను ఉపవాస దీక్షల విరమణ సమయంలో విధిగా పాటించాలని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపారు.

ఉపవాసాలపై పరిశోధనకు నోబెల్ ప్రైజ్

ముస్లిం ఉపవాసాలపై చేసిన పరిశోధనలకుగాను యాషినోరి ఓషుమీ అనే జపాన్ శాస్త్రవేత్తకు 2016లో నోబెల్ బహుమతి లభించింది. ఉపవాసాల వల్ల శరీరంలో ఆటోఫ్యాగీ (సెల్ఫ్ ఈటింగ్ సిస్టం) జరిగి క్యాన్సర్ కణాలు, రోగ కారక క్రిములు నశిస్తాయని ఆయన శాస్త్రీయంగా నిరూపించారు.

ఆరోగ్యవంతులందరూ ఉపవాసాలు చేయాలి



ఉపవాసాల ప్రయోజనాలు పొందలేని వారు దురదృష్టవంతులని మహమ్మద్ మహా ప్రవక్త (స.అ.సం) తెలిపా రు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రం జాన్ ఉపవాసాలు పాటించాలి. ఉపవాసా లు ఓర్పు, సహనం నేర్పిస్తాయి. రంజాన్ మాసంలో నేర్చుకున్న విషయాలతో మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా, నియమబద్ధంగా, ఉన్నతంగా గడపవచ్చు.

\- ముఫ్తీ అబ్దుల్లా, ఇమామ్, జామియా మసీదు, పీలేరు

ప్రీ స్కూల్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

● ఐసీడీఎస్ పీడీ రమాదేవి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

పీలేరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పూర్వ పాఠశాల విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. ఆర్టీసీ నల్లగుట్టలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె అంగన్‌వాడీ కేంద్రంలోని స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఆటపాటలతో చిన్నారులను ఉత్సాహపరిచారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,275 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో 1,858 ప్రధాన, 417 మినీ కేంద్రాలు ఉన్నాయన్నారు. 1030 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తుండగా 795 కేంద్రాలు అద్దె భవనాల్లో, 450 కేంద్రాలు ఉచిత భవనాల్లో నడుస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,260 మంది గర్భిణులు, 8,323 మంది బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ఇతర సేవలు అందిస్తున్నామన్నారు. ఏడు నెలల పసికందు నుంచి మూడేళ్ల వయసున్న 53,022 మంది, 3-6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు 42,037 మంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పొందడమే కాకుండా పూర్వ పాఠశాల విద్యను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీ వర్కర్లు అఖిల, అనిత, సహాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా బాట గంగమ్మ రాత్రి తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో బాటగంగమ్మ

మదనపల్లె అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గవంక కాల్వలోని బాట గంగమ్మ ఆలయంలో రెండు రోజులుగా తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త బొగ్గిటి అలివేలు తెలిపారు. మంగళవారం ఉదయం ఆలయం శుద్ధి చేసి పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలకరించారు. సాయంత్రం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో చెక్క భజనలు, కోలాటాలు ప్రదర్శించారు. భక్తులు దీలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ బొగ్గిటి అలివేలమ్మ, తదితరులు పర్యవేక్షించారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

గుర్రంకొండ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టణం నడిబొడ్డున వెల్డింగ్ దుకాణంలో గంజాయి పట్టుబడడం గుర్రంకొండలో కలకలం రేపుతోంది. పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో దానికి అలవాటుపడిన యువకులు ఊరు దాటేసినట్లు సమాచారం. గుర్రంకొండ పట్టణంలోని జడ్పీ హైస్కూల్ ప్రహరీగోడ పక్కనే కొందరు రేకులషెడ్‌లు ఏర్పాటు చేసుకుని అందులో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఓ షెడ్లలో ఉన్న ఓ వెల్డింగ్ దుకాణంలో కొంత కాలంగా గంజాయిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీ చేయగా కొంత మొత్తంలో గంజాయి పట్టుబడింది. ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీంతో గంజాయి బ్యాచ్‌ల్లో వణుకు మొదలై చాలా మంది పరారైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ మధు రామచంద్రుడును వివరణ కోరగా గంజాయి పట్టుబడిన విషయం వాస్తవమేనని, నిందితులను పూర్తి స్థాయిలో విచారణ చేసి ముఠా సభ్యులను అరెస్టు చూపుతామన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

సిద్దవటం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరంలో సోమవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. డీలర్ బిట్టా సుబ్బరాయుడు, ఎండీయూ ఆపరేటర్ శంకర్ నివాసాల్లో 750 కిలోల బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు సౌజన్య, వీఆర్వో శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాలివీడు, మార్చి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భిక్షాటన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి కడప రిమ్స్ లో మృతి చెందాడని, అతడి గురించి తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. 30 ఏళ్లుగా గాలివీడు పట్టణంలోని గేటు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ వీధుల్లో తిరుగుతుండే అతను అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతుడిని గుర్తుపడితే గాలివీడు ఎస్ఐ 9121100556 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రాజంపేటలో..



యాచకుడి మృతదేహం

రాజంపేట టౌన్: రాజంపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని ఓ వృద్ధ యాచకుడు మృతి చెందాడు. రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మెయిన్‌గేటు ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి పక్కన అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అతని వివరాలు తెలియరాలేదు.

ఈ చిన్నారులకు దిక్కెవరు?

● తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారిన బాలికలు



తల్లిదండ్రులతో చిన్నారులు కృతికారెడ్డి, లిత్వికారెడ్డి (ఫైల్)

కురబలకోట, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదం ఇద్దరు చిన్నారులను అనాథలను చేసింది. వాల్మీకిపురం మండలం విఠలం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ అడవిపల్లెకు చెందిన శారద(40) మృతి చెందగా, ఆ ప్రమాదంలో గాయపడిన మాధవ రెడ్డి(50) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విషయం విదితమే. మంగళవారం మాధవరెడ్డి అంత్యక్రియల సందర్భంగా వారి కూతుళ్లు ఏడేళ్ల కృతికారెడ్డి, మూడేళ్ల లిత్వికారెడ్డి రోదన కంట తడి పెట్టించింది. అమ్మా...నాన్నా మాకు దిక్కెవరంటూ రోదిస్తున్న ఆ చిన్నారులను సమదాయించడం ఎవరికీ సాధ్యం కాలేదు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుంటున్న రెండు గ్రామాల వీఆర్వోలు

పెనగలూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పెనగలూరు మండలం ఓబిలి వీ ఆర్వో నరసింహులు, నందలూరు మండలం టంగుటూరు వీఆర్వో శివకుమార్ మంగళవారం అడ్డుకున్నారు. దీంతో ట్రాక్టర్ల డ్రైవర్లకు, వీఆర్వోల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. వారు దాడికి తెగబడే పరిస్థితి వస్తుందని పసిగట్టిన వీఆర్వోలు పెనగలూరు పోలీసులకు, స్థానిక తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు. అయితే, వారి నుంచి ఎలాంటి సహకారం లభించకపోవడంతో స్థానికుల సాయంతో కొన్ని ట్రాక్టర్లను మాత్రం ఇసుక నింపుకోకుండా అడ్డుకోగలిగారు.

పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ శివయ్య



విలేకరులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

రామాపురం, మార్చి4(ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను మార్చి 30 నాటికి పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ శివయ్య ఏఈలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 79,721 పక్కా గృహాలు మంజూరు కాగా, 2024 జూన్ నాటికి 33,179 పక్కా గృహాలు పూర్తి కాగా, 12,390 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 32,118 పక్కా గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో 4,864 పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రామాపురం మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్న కేఎస్ఎం ప్రసాద్ 12 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తుండడంతో ఆయనను ఓబులవారిపల్లె మండలానికి బదిలీ చేస్తూ ఈ నెల 1న కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, కానీ ఇంతవరకు ఆఫీసుకు రాలేదని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక వారానికి మూడుసార్లు హౌసింగ్ లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతోందని దీంతో లబ్ధిదారులు ఉత్సవంలా తమ ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు.

ఈ ప్రభుత్వం ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, బీసీ చేనేత మగ్గాలకు రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం అదనంగా మంజూరు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు శ్రద్ధ చూపి త్వరగా గృహాలు నిర్మించుకోవాలన్నారు. కొత్తగా ఇళ్లు కావలసిన వారు, సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవాలనుకున్న వారు గ్రామ పరిధిలోని సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ డిజిటల్ అసిస్టెంట్లను కలిసి దరఖాస్తు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమిస్తే కఠినచర్యలు: ఆర్డీవో

● కొండ్రాజుపల్లె చెరువులో ఆక్రమణల పరిశీలన

● హెచ్చరిక బోర్డులు ఏర్పాటు





కొండ్రాజుపల్లె చెరువును పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కాశినాయన మార్చి4(ఆంధ్రజ్యోతి)చెరువులు ఆక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టేదిలేదని బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్ హెచ్చరించారు. మంగళవారం ఆక్రమణకు గురైన కొండ్రాజుపల్లె చెరువును తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. చెరువులో ఆక్రమణదారులు బోర్లు వేసి కరెంట్ సర్వీసులు ఏర్పాటు చేసుకొని అరటి,దొండ,బత్తాయి తదితర పంటలను సాగుచేయడం, మరి కొందరు పంటలు సాగుచేసేందుకు చెరువు దుక్కిదున్ని సిద్ధం చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువు మ్యాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1017, 1018 సర్వే నెంబర్లలోని 151.10 ఎకరాల్లో చెరువు విస్తరించిందన్నారు. ఇందులో పట్టాభూమి 35.75 ఎకరాలు, ప్రభుత్వభూమి 115.34 ఎకరాలు ఉందన్నారు. దాదాపు 67 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయి విస్తీర్ణాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలని, చెరువులోకి ఆక్రమణదారులు ఎవరూ దిగకుండా చుట్టూ కందకం తవ్వాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు చెరువుకు హద్దులు నిర్ణయించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో బద్వేల్ సర్వే డీఐ రఘురామయ్య, మండల సర్వేయర్ రామాంజనేయులు, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ కొండారెడ్డి స్థానిక వీఆర్వో నరసింహులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆక్రమణలపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మ, ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ

అట్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన 1245/6 సర్వే నెంబరులోని సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా స్థానికంగా ఉన్న యాదవులు గొర్రెలను మేపుకునే వారు. సుమారు 55 కుటుంబాలు అందులోనే గుడిసెలు వేసుకుని, దొడ్లు కట్టుకుని గొర్రెలను పోషించుకునేవారు. 2022లో వైసీపీ నాయకులు ఆ గుడిసెలు, దొడ్లను తొలగించి యంత్రాలతో చదును చేసి భూమిని ఆక్రమించుకోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకు మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం సమర్పించడంతో, సమస్యను పరిశీలించాలంటూ ఆయన జిల్లా అధికారులకు రెఫర్ చేసినా, స్థానిక అధికారులెవరూ పట్టించుకోలేదని యాదవ సంఘం నాయకుడు గురవయ్య తెలిపారు. ఇంతలో సమస్య పరిష్కారమైందా అంటూ వారం రోజుల క్రితం విజయవాడ టీడీపీ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో పరిష్కారం జరగలేదని సమాధానమిచ్చామన్నారు. వారం రోజుల అనంతరం మంగళవారం అట్లూరు తహసీల్దారు సుబ్బలక్ష్మి, ఎంపీడీవో భాస్కర్ బాబు, అట్లూరు ఎస్ఐ రామకృష్ణ తమ ఇంటి దగ్గరకు వచ్చి విచారణ చేశారన్నారు. న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చినట్లు గురవయ్య వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుబ్బలక్షుమ్మ మాట్లాడుతూ 1245/6 సర్వే నెంబరు లో 2009లో కొందరికి పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉందని తెలిపారు. . ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై అతివేగం

● ఒకరి దుర్మరణం.. మరొకరికి తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 4(ఆంధ్రజ్యోతి): గరుడ వారధిపై బైకును మితిమీరిన వేగంతో నడిపారు. రామానుజం సర్కిల్ వద్ద అదుపు చేయలేక రక్షణ గోడను ఢీకొన్నారు. ఇద్దరు యువకులు పైకి ఎగిరి పడి ఒకరు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి. తిరుపతిలో మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన ప్రకారం.. మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు.. తిరుపతిలో బీ-టెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థి సునీల్‌తో కలిసి తిమ్మినాయుడుపాలెంలో ఉంటున్నాడు. వీరిద్దరూ మంగళవారం వేకువజామున తిరిచానూరు నుంచి బైక్‌పై వస్తూ మామిడి కాయల మండీ వద్ద గరుడ వారధిపైకి ఎక్కారు. రామానుజ సర్కిల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కనే వున్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మదనపల్లెకు చెందిన అభిరామానాయుడు (24) డివైడర్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడివెనుక కూర్చుని ఉన్న సునీల్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఈ ఘటనకు అతివేగం.. నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేశారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని.. ఆస్తికి ఎసరు!

● చీటింగ్ కేసు నమోదు చేశారని నిందితుడి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్య ధ్రువీకరణ పత్రం ఇప్పిస్తానని చెప్పి టీడీపీ కార్యకర్త తన ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఓ వృద్ధురాలు మంగళవారం కడప తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు షేక్ రహ్మత్ బీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలిలా.. కడప నగరంలోని నబీకోట మరాఠివీధిలో షేక్ రహ్మత్ బీకి నాలుగున్నర సెంట్లు స్థలం ఉండగా మూడు సెంట్లలో ఇల్లు నిర్మించుకుని నివాసముంటోంది. చిలకలబావి మంచాలరామయ్య వీధిలో నివాసం ఉంటున్న షేక్ సుల్తాన్ ఇమ్రానుద్దీన్ ఆ ఇంటిని, ఖాళీస్థలాన్ని కాజేయాలని పథకం రచించాడు. బాధితురాలికి చెవుడు ఉండడంతో సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని గత ఏడాది జూన్ 12న రిమ్స్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి నేరుగా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకువెళ్లి ఇల్లు, ఖాళీస్థలాన్ని తన పేరుతో జీపీఏ చేయించుకున్నాడు. రెండోసారి షేక్ రహ్మత్‌బీని రిజిస్ట్రేషన్ ఆఫీసుకు తీసుకువెళ్లి తన తల్లి గులాబ్‌జాన్‌కు, రహ్మత్‌బీ ఒకటిన్నర సెంట్ల స్థలాన్ని విక్రయించినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో ఆ స్థలాన్ని కొలతలు వేస్తుండడంతో అనుమానం వచ్చిన రహ్మత్‌బీ ప్రొద్దుటూరులోని తన సోదరుడు నబీరసూల్‌కు తెలియజేసింది వారు వచ్చి పరిశీలించగా.. తాను రహ్మత్‌బీ భర్త షేక్ జమాల్‌కు అన్న కుమారుడినని నిందితుడు జీపీఏ పత్రాల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5న షేక్ ఇమ్రానుద్దీన్ పేరు మీద ఉన్న జీపీఏను రహ్మత్‌బీ రద్దు చేయించింది. కానీ ఒకటిన్నర సెంట్ల స్థలం గులాబ్ జాన్ పేరు మీద రిజిస్ట్రేషన్ పూర్తయి ఉండడంతో తనకు న్యాయం చేయాలని ఫిబ్రవరి 24న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీని ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో ఇమ్రానుద్దీన్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. పలుమార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అతను వాస్మోల్ సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతనిని రిమ్స్‌కు తరలించారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షతో ఉజ్వల భవిష్యత్తు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించే సెంట్రల్ యూనవర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్ ప్రొఫెసర్ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం కడప నగరం ఆర్ట్స్ కళాశాలలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి కృష్ణారెడ్డి, సైన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, గౌరవ సలహాదారులు బి రామచంద్ర, అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



సీఈకి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డి

బద్వేలుటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, ఎల్ఎస్‌పీ డ్యాం చైర్మన్ ఈగ రమణారెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్రావు ను వేరువేరుగా కలసి నిధుల మంజూరుకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. బ్రహ్మంసాగర్ నుంచి బద్వేలు నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీటిని విడుదలచేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరినట్లు వివరించారు. ఎల్ఎస్‌పీ డ్యాం ద్వారా ప్రతి చెరువుకు నీరు అందించి, ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాయికిరణ్‌రెడ్డి, కలూరు రామకృష్ణారెడ్డి, ఓ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కలసపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. కలసపాడులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ నివేదికను మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదికలో డీఆర్పీలు చదివి వినిపించారు. 878 పనులకు గాను రూ.7.27కోట్లు ఖర్చుచేశారు. ఇందులో రూ.96వేలు అవినీతి జరగ్గా ఇప్పటికే రూ.30వేలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆనంద్, ఎంపీడీఓ మహబూబ్‌బీ, విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు రామలింగేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి, డీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో బోధనా సిబ్బంది క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ కాలేజ్ ఫౌండేషన్ డే సందర్భంగా మంగళవారం బోధన సిబ్బంది క్రికెట్ ఫైనల్ పోటీలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీ కనీవినీ ఎరుగని విధంగా పోటాపోటీగా సాగాయి. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కృష్ణారావు కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు వి మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో మాజీ రిజిస్ట్రార్ డి.విజయ రాఘవ ప్రసాద్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టు నిలిచింది. విజేతలను ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం

● ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ

● ఆదర్శంగా నిలుస్తున్న రైతు గంగిరెడ్డి

పెండ్లిమర్రి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మన పెద్దల కాలంలో ప్రకృతిలో లభించే వాటితో వ్యవసాయం చేసి ఆహార, వాణిజ్య ఉత్పత్తులను పండించేవారు. సహజంగా దొరికే పేడ, మూత్రం తదితర వాటితో భూసారాన్ని పెంచుతూ వ్యవసాయం చేసేవారు. ఖర్చులు తక్కువగా ఉండి.. దిగుబడులు ఎక్కువగా వచ్చి మంచి ఆదాయం లభి స్తుండేది. అయితే కాలక్రమంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకంతో రైతులకు ఖర్చులు విపరీతంగా పెరిగి పంటల దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకో వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం గణనీయంగా తగ్గి పంటలు





పంటల రక్షణ కోసం వాడుతున్న కషాయాలు

దిగుబడి మందగించింది. ఈ నేపథ్యంలో ఆదర్శ రైతు గంగిరెడ్డి ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి మం చి ఆదాయం పొందుతూ పలువురికి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పెండ్లిమర్రి మండలం చెన్నమరాజు పల్లె గ్రామానికి చందిన ఆదర్శ రైతు గంగిరెడ్డి ఆయన తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని 2008 సంవత్సరంలో పురుగు మందుల వాడకం లేని (ఎన్‌పీయం) వ్యవసాయాన్ని మొదలు పెట్టాడు. ప్రకృతిలో దొరికే వేప, కానుగ, సీతాఫలం, ఉమ్మెత్త ఆకులు, వేపగింజలు, కానుగ గింజల పౌడర్, తెల్లవాయలు, కుంకుడుకాయలు, మిరియాలు, లవంగాలను గోమూత్రంతో కలిపి సర్వరోగ నివారణ ద్రావణం తయారు చేసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఉత్పత్తులను పండిస్తూ అధిక లాభాలు



రైతు గంగిరెడ్డి సాగుచేసిన అంతర పంటలు

ఆర్జిస్తున్నాడు. గంగిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని మరికొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం చేపడుతున్నారు. ఇక ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక, రాష్ట్రా లతో ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతు లకు శిక్షణ కార్యక్రమాలు కూడా ఇస్తున్నారు. అలాగే అగ్రికల్చర్ బీఎస్సీ చదివే విద్యార్థులు చెన్నమరాజుపల్లెకు వచ్చి గంగిరెడ్డి వద్ద శిక్షణ తీసుకోవడం విశేషం.

వెల్లటూరులో వారపు మార్కెట్...

వెల్లటూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందకు గంగిరెడ్డి తను పండించిన పంటలను వారపు మార్కెట్‌లో విక్ర యిస్తు న్నారు. దీని ద్వారా నెలకు రూ.25000ల వరకు ఆదాయం వస్తోంది. అలాగే ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే ఈ విక్రయ కేంద్రం ప్రధాన లక్షమని గంగిరెడ్డి చెబుతున్నారు.

గండికోట మునకకు రూ.500 కోట్లు ఇవ్వాలి

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆది



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో గండికోట ప్రాజెక్టు ముంపు పరిహారం గురించి మంగళవారం ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రస్తావించారు. గండికోట మునకకు సంబంధించి రూ.500 కోట్లు బకాయిలుంటే రూ.150 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో పెట్టారని తెలిపారు. మిగిలిన రూ.350 కోట్లు కూడా ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రాజోలి నిర్మాణం, ఎస్ఆర్‌బీసీకి నిధులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం నీటిపారుదలకు బడ్జెట్‌లో రూ.18,000 కోట్లు మాత్రమే కేటాయించారని ఈ నిధులు సరిపోవన్నారు. కేంద్రం నీతిఆయోగ్ కింద ఐదు రాష్ట్రాలను చేర్చిందని.. అందులో మన రాష్ట్రం కూడా ఉందన్నారు. దానికి అనుగుణంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు మరో రూ.18,000 కోట్ల కేటాయించేలా కేంద్రం దృష్టికి తీసుకెళదామన్నారు.

ఆర్టీపీపీ రైతులకు న్యాయం చేయాలి

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని మంగళవారం ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబును ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి కలిశారు. విజయవాడలోని ఏపీజెన్‌కో కార్యాలయాన్ని సందర్శించి ఆర్టీపీపీ రైతుల సమస్యలను వివరించారు. ఆర్టీపీపీ కోసం రైతులు భూములను కోల్పోయిన వారికి న్యాయం జరగక ఇబ్బంది పడుతున్నారన్నారు. సర్వే చేసి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. కూటమి నేత దేవగుడి శివనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఎదగడానికి యోగా ఎంత గానో ఉపయోగపడుతుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నబీకోటలోని మహిళా శక్తి కేంద్రంలో మంగళవారం యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మహిళలు, అంగన్వాడీ వర్కర్లు, మెప్మా పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు యోగా శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ ప్రతి మహిళా యోగా తప్పకుండా చేయాలని వివరించారు. యోగా నిపుణుడు డాక్టర్ ఆర్.రంగ నాథరెడ్డి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కారణంగా ఎదురవుతున్న అనేక రుగ్మతలను నివారించగలిగే శక్తి యోగాకు ఉందన్నారు. అనంతరం యోగాసనాలు చేయించారు.

రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలంపై ఆరా



రాజా ఫౌండేషన్‌లో ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

మైలవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజా ఫౌండేషన్‌లో మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తనిఖీ చేశారు. రాజాఫౌండేషన్‌లో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి అందుకు దారితీసిన వాటిని త్వరగా తొలగించాలని ఆదేశించారు. మైలవరం తహసీల్దారు లక్ష్మినారాయణ, సర్వేయర్ ఆర్డీవోకు ఆక్రమిత స్థలం గురించి వివరించారు. గతంలో నోటీసులు అందజేశామని, త్వరలోనే ఖాళీ చేస్తామని రాజాఫౌండేషన్ సంబంధిత అధికారులు తెలిపారని వివరించారు. త్వరగా ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను ఆర్డీవో తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ కాలనీవాసుల దీక్షల విరమణ



నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న తహసీల్దారు ఉదయభాస్కర్

బద్వేలురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట సమీపంలో ఉన్న సీపీఐ కాలనీవాసులు తాము నివాసం ఉంటున్న చోట ఇంటిపట్టాలు ఇవ్వాలంటూ గత 12 రోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షలను మంగళవారం తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఈ ప్రాంతంలోనే ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర మాట్లాడుతూ పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలోనే తహసీల్దారు పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వడం శుభపరిణామమన్నారు. అలాగే చుట్టుపక్కల ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను కూడా స్వాధీనం చేసుకోవాలని తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్, సుబ్బారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల చేయూత



ఆర్థికసాయం చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

మైదుకూరు రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాటి ఫొటో గ్రాఫర్ చనిపోతే మనకేమిలే అనుకోకుండా... తోటి ఫొటో, వీడియో గ్రాఫర్లు తమ వంతు విరాళమిచ్చి ఆ ఫొటో గ్రాఫర్ కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే... ఫొటో గ్రాఫర్ చంటిబాబు జనవరి 23న రాత్రి స్టూడియో పనులను ముగించుకొని మైదుకూరు నుంచి సొంతగ్రామమైన ఎర్రబల్లెకు బైక్‌పై వెళుతుండగా లారీ ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో చంటి కుటుంబానికి అండగా నిలవాలని తోటి ఫొటోగ్రాఫర్లు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మైదుకూరు, ప్రొద్దుటూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ వారు మంగళవారం చంటి కుటుంబ సభ్యులకు సుమారు రూ.లక్షా 33 వేలు స్వచ్ఛందంగా సేకరించి వారికి అందించారు. కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆహ్వానం

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడపలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులకు ప్రవేశాలు ఉన్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సత్యశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైనార్టీ బాలురుతో పాటు ఎస్సీ, ఎస్టీల బాలురు కూడా ఈ ప్రవేశానికి అర్హులన్నారు. 6,7,8 తరగతులకు మిగిలిపోయిన సీట్లలో చేరేందుకు కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 1 నుంచి 31 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. 15 మందికి గాయాలు



కల్వటాల వద్ద బోల్తాపడిన అద్దె బస్సు

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీకి చెందిన ఏపీ 39 యూవై 4299 గల ఆర్టీసీ బస్సు మంగళవారం కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామ సమీపాన బోల్తా పడినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మందికిపైగా గాయాలయ్యాయి. వీరిని అవుకు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉన్న సుబ్బమ్మ, దస్తగిరమ్మలను కర్నూలుకు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు విచారణ చేసి రిపోర్టును ఉన్నతాధికారులకు పంపుతామని డిపో మేనేజర్ తెలిపారు. కాగా, డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు ఆరోపించారు. బస్సు డ్రైవర్ ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

కలెక్టరేట్‌లో మానసిక రోగి హల్‌చల్

● సెక్యూరిటీ సిబ్బందిపై దాడి ● కట్టేసిన సిబ్బంది



సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడిన మానసిక రోగి

కడప కలెక్టరేట్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి) కడప కలెక్టరేట్‌లో సోమవారం ఓ మానసిక రోగి హల్ చేశారు. నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన అతను వీజీఆర్ఎస్‌లో తాను నివాసం ఉండే ఇళ్ల గతంలో అమ్మకాలు జరిగాయి. ఆ ఇంటి ని ఖాళీ చేయాలని కొనుగోలు దారుడు అడగడంతో తన సమస్య పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అనంతరం తన సమస్యకు ఇప్పటికిప్పుడే పరిష్కారం చూపాలని పట్టుపట్టడంతో సెక్యూరిటీ గార్డులు, సిబ్బంధి, పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతనిపై చర్యలు తీసుకోకపోగా కలెక్టరేట్ బయట వదిలి వెళ్లారు. అయితే తన సమస్య తీర్చ లేదంటూ మంగళవారం కూడా కలెక్టరేట్‌కు వచ్చి హల్‌చల్ చేశారు. అతని చర్యలను సెక్యూ రిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నోటితో కొరకడంతో వెంటనే రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. మానసిక రోగి ఎంతకు మాట వినకపోగా, ఇతరులపై దాడులకు దిగడం, తనకు తానే రాళ్లతో గాయపరుచు కోవడంతో సిబ్బంది అతన్ని సాహసించి పట్టుకొని కట్టి వేసి పోలీసులకు సమాచారం అందించారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



స్వాతి మృతదేహం

చక్రాయపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలం లోని హరిజనవాడకు చెంది న పెద్దపాగా స్వాతి (24) అనే మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేర కు... స్వాతి కూలి పనులు చేసుకుంటూ జీవనం గడు పుతూ వచ్చేది. ఆమెకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ మధ్య తన భర్త సం పాదన కోసం కువైట్‌కు వెళ్లాలని నిర్ణయించు కోవడంతో ఆమె వద్దు అని వారించినట్లు తెలిసింది. ఈవిషయమై మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో ఉరివేసుకొని మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. తల్లి మృతితో నలుగురు చిన్నారులు అనాథలుగా మారారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరుపై దాడి

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అలంఖాన్‌పల్లె వద్ద ఆర్టీసీ అద్దె బస్సు నిలపలేదంటూ ఆగ్రహించిన ఓ వ్యక్తి ఆ డ్రైవరుపై చెప్పుతో దాడి చేసినట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కడప నుంచి మైదుకూరు వైపు వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సును అలంఖాన్‌పల్లె చెందిన క్రిష్ణారెడ్డి ఆపేందుకు ప్రయత్నించారు. బస్సు ఆపకపోవడంతో ఆగ్రహించిన క్రిష్ణారెడ్డి బస్సు వెంట పడి బస్సు డ్రైవరు బాలయ్యను చెప్పుతో కొట్టినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి అసభ్య సందేశం.. కేసు నమోదు

వేంపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న ఓ విద్యార్థిని ఫోన్‌కు తిరుపతికి చెందిన అభిషేక్ అనే వ్యక్తి అసభ్యకర సందేశం పంపడంతో కేసు నమోదు చేసినట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. అసభ్య సందేశాన్ని ఆ విద్యార్థిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త దృష్టికి తీసుకురావడంతో పరిశీలించిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అధ్యాపకుడిపై వేటు: ట్రిపుల్‌ఐటీలోనే చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థిని పట్ల ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో పనిచేస్తున్న ఫిజిక్స్ అధ్యాపకుడు అసభ్యంగా మాట్లాడిన విషయాన్ని ఆ విద్యార్థిని డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీనిపై అకడమిక్ డీన్ రత్నకుమారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ నిర్ణయం మేరకు ఆ అధ్యాపకుడిపై వేటు వేయాలని నిర్ణయించి.. వెంటనే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డైరెక్టర్ ఆదేశించినట్లు ట్రిపుల్‌ఐటీ వర్గాలు తెలిపాయి.

డాక్టర్ లాజర్‌కు ప్రపంచ న్యూరోసైన్స్ సైకియాట్రి కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం



డాక్టర్ లాజర్

కడప ఎడ్యుకేషన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): థాయ్‌ల్యాండ్, బ్యాంకాక్‌లో ఎపిసిరస్ సైంటిఫికా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీలో జరగనున్న వరల్డ్ న్యూరోసైన్స్ అండ్ సైకియాట్రి కాన్ఫరెన్స్-2025నకు యోగివేమన విశ్వవిద్యాలయం సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ వేపరాల లాజర్‌కు సంస్థ ఆర్గనైజింగ్ సెక్రటరీ నుంచి ఆహ్వానం అందింది. రెండు రోజుల సదస్సులో డాక్టర్ లాజర్ డెమొగ్రాఫిక్ వేరియ బుల్స్‌కు సంబంధించి కొవిడ్-19కు గురై కోలుకున్న వ్యక్తుల క్షేమ, మానసిక ఆందోళన అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పిస్తారు. రష్యా, ఇండోనేషియా, ఈజిప్ట్, కెనెడా పలు ప్రపంచదేశాల నుంచి హాజరయ్యే పరిశోధకులతో డాక్టర్ లాజర్ తన పరిశోధన జ్ఞానాన్ని పంచుకుంటారు. ఈ సందర్భంగా డాక్టర్ లాజర్‌ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఫణతి ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘు నాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, అధ్యాపకులు, స్కాలర్లు అభినందించారు.

విద్యుత్ లైన్‌మెన్ సేవలు వెలకట్టలేం

పులివెందుల టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌మెన్ సేవలు వెలకట్టలేమని జిల్లా ఎస్ఈ రమణ అన్నారు. మంగళవారం స్థానిక డివిజను కార్యాలయంలో జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో లైన్‌మెన్ అందించే సేవలు అమోఘమన్నారు. అనంతరం విద్యుత్ నిర్వహణలో అత్యంత సేవలకు గాను పులివెందులవెస్ట్, టౌన్‌లో పనిచేస్తున్న లైన్ ఇన్‌స్పెక్టరు సుధాకర్‌రెడ్డి, అంజిలకు ఉత్తమ ప్రతిభా అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో



లైన్‌మన్ సుధాకర్‌కు సర్టిఫికెట్ అందిస్తున్న ఎస్ఈ రమణ

డివిజను ఇంజనీరు ప్రసాదరెడ్డి, ఏడీఈ గురుమోహన్ రెడ్డి, ఏడీఏ సుధాకర్‌రెడ్డి, ఏడీ నాగేంద్ర, ఏఈ జగదీశ్‌రెడ్డి, సబ్ ఇంజనీరు, లైన్ ఇన్‌స్పెక్టరు, లైన్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..: విద్యుత్ శాఖ పురోభివృద్ధిలో లైన్‌మెన్ పాత్ర ఎంతో కీలకమని కడప ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిసేవ్యానాయక్ అన్నారు. మంగళవారం లైన్‌మన్ దివస్ సందర్భంగా కడప డివజన్ కార్యాలయంలో ఓ అండ్ ఎం స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, కేక్ కటింగ్ చేసి సంబరాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న యూనియన్ సభ్యులు, భారీ సంఖ్యలో ఎనర్జీ అసిస్టెంట్లు, జేఎల్ఎంలు, లైన్‌మెన్ పాల్గొన్నారు.

హోళీ సంబరాలను ఆనందంగా జరుపుకోండి : ఎస్పీ



ఆవిష్కరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప కల్చరల్ మార్చి 4, (ఆంధ్రజ్యోతి): హోళీ పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ శుక్రవారం నగర శిల్పారామం సమీప గిరిజన భవన్‌లో తలపెట్టిన సంబరాల ను ఆనందకర వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. ఆ మేరకు ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శివా నాయక్ సారథ్యంలో రూపొందించిన హోళీ సంబరాల పోస్టర్లను మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌రాథోడ్, రాష్ట్ర కార్యదర్శులు వెంకటస్వామినాయక్, అర్జున్‌నాయక్, ఢాకే నాయక్ పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన జిల్లా అధ్యక్షుడు వాసు, ఎమ్మెల్యే



కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన డీజీపీ హరీష్ కుమార్‌గుప్తను మంగళవారం విజయవాడలో కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతలు నియోజకవర్గ సమస్యలపై డీజీపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

కడప అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



సీఎంతో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి కోరారు. మంగళవారం సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబును ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్ర బాబును కలిశారు. కడప నియోజ కవర్గంలో గల సమస్యలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపాన ఉత్పత్తుల అమ్మకాలు నిషేధం

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్,స్కూళ్లు, జన సమూహాలకు దగ్గరలో ధూమపాన ఉత్పత్తుల గురించి మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంటు ప్రత్యేక డ్రైవ్ రాష్ట్ర లీగల్ కన్సల్టెంట్ శివశంకర్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ మేరకు పోస్టర్లు విడుదల చేశారు. అలాగే డీఎల్‌సీసీ మీటింగ్‌లో భాగంగా అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్టేట్ లీగల్ కన్సల్టెంట్ శివశంకర్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, ఎన్‌టీసీపీ స్టాఫ్ శ్రీవాణి, సుమలత, సైకాలజిస్ట్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వేసవి కాలంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వల్లూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవి కాలంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని తాగునీరు, పరిశుభ్రతలో ముందస్తు ప్రణాళికలు తీసుకోవాలని ఎంపీడీవో రఘురాం, మండలాధ్యక్షురాలు మల్లీశ్వరి అన్నారు. మంగళవారం ఎంపీడీవో సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి ఆయాశాఖల అధికారుల వద్ద అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దారు వెంకటలక్ష్మి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సిబ్బంది అలసత్వంతో పూడిపోతున్న మురుగుకాల్వలు. కడప నగరం నాగరాజుపేట వద్ద కాల్వ మీద మొలిచిన చెట్టు. దీని వల్ల మురుగు పారడానికి ఇబ్బంది అవుతున్నా కాల్వ పూడిపోతున్నా చూసీచూడనట్లు చూస్తున్న కార్పొరేషన్ సిబ్బంది. ఈ విధంగా మురుగుకాలువల గోడలకు నగరంలో పలుచోట్ల మొక్కలు పెరిగి చెట్లుగా మారుతున్నా కార్పొరేషన్ సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కడప సెవెన్ రోడ్స్, ఆంధ్రజ్యోతి



డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్ మార్చి 4 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, మోటారు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డప్పు, కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ కడప నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగభద్రత కల్పించాలి

కడప మారుతీనగర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటుగా ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన ఆశాడే సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఎన్ఎం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాకు ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తిచేసిన జిల్లాలోని ఆశా కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ డిప్యూటీ జిల్లా జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఆశా యూనియన్ నాయకులు నిర్మల, ప్రియదర్శిని, జమాల్, బి. వెంకటరత్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో శ్మశానానికి బోరు

సికెదిన్నె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి సహకారంతో కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి అనుమతితో బోరు మంజూరుకావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం శ్మశానంలో బోరు వేశారు. ఇంతకాలంగా బోరుకోసం ఎదురుచూస్తున్న స్థానికులు ఆనందంగా ఉన్నారు. కార్యక్రమంలో రామమోహన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయం

వేంపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రధానంగా ఉత్తరాంధ్రలో పీఆర్టీయూ ఉపాధ్యా యులందరూ సమష్టి కృషిచేయడం ద్వారా గాదె శ్రీనివాసుల నాయుడు విజయంసాధించారని పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ నిరంతరం కృషిచేస్తుందని ఆయన తెలిపారు.

7న బండలాగుడుపోటీలు

సికెదిన్నె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీన చిన్నపల్లి యోగినరసింహస్వామి 217 ఆరాధన సందర్భంగా రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరి ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 7వ తేదీ ఉదయం 11 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని, ఇందులో పాల్గొనే ఎద్దుల యజమానులు ఉదయం 7 గంటలకు కమిటీ వారి వద్ద రశీదు పొందాలన్నారు. మొదటి బహుమతి రూ.70,016, రెండో బహుమతి రూ.50,016,మూడో బహుమతిరూ.30,016, 4వ బహుమతి రూ.20,016, 5వ బహుమతి రూ.15,016, 6వబహుమతి రూ.10,016 అందివ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు

కడప క్రైం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా నగరంలోని ఎస్వీ డిగ్రీకళాశాల విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ జి.ఈదురుబాషా నిర్వహించారు. ఈ సందర్భంగా యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాషా మాట్లాడుతూ వక్తృత్వ పోటీల ద్వారా మహిళల సాధికారత, సమానత్వం, హక్కులు,మహిళా భద్రత వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడ తాయన్నారు.

శబ్ద కాలుష్య సైలెన్సర్లు వాడితే చర్యలు

రిమ్స్ ఎస్ఐ జయరాములు



సైలెన్సర్ మార్పిస్తున్న ఎస్ఐ జయరాములు

కడప (క్రైం), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బుల్లెట్ వాహనాలకు శబ్దకాలుష్యం ఉన్న సైలెన్సర్‌లో వాడితే చర్యలు తప్పవని రిమ్స్ ఎస్ఐ జయరాములు హెచ్చరించారు. సీఐ సీతారాంరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. శబ్ద సైలెన్సర్‌లో కలిగిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పట్టుకుని సైలెన్సర్లు మార్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్, స్పోర్ట్స్ వాహనాలు సైలెన్సర్‌లు మార్చి నడుపుతున్న వారికి జరిమానా విధించి బైకులు సైలెన్సర్లను తీసివేయించి, మరోసారి సైలెన్సర్లు వాడితే బైకు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన

కడప కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల వివరాలను తెలుసుకోవడం వలన మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని ప్రబోధ సేవా సమితి కడప కమిటీ అధ్యక్షుడు నవనీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కడప కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అశోక్‌నగర్ లో త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత యోగి ప్రబోధా నంద యోగపీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఈశ్వర్, సదానందుడు, ఎల్లారెడ్డి, వెంకటరమణ, మణి, నాగేంద్ర, రామనాథం పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



కడప కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగర ఎర్రముక్కపల్లెలో ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని మంగళవారం సాయిపేట పురపాలక ఉన్నత పాఠశాల, నకాష్‌లోని పురపాలక ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకుడు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు రమేష్‌రావు, గ్రంథాలయ ఆవిర్భావ వికాసాలను, తాళపత్ర గ్రంథాలను వివరించారు. విద్యార్థులను ప్రోత్సహించి గ్రంథాలయానికి తీసుకురావడం పట్ల వైవీయూ ఉపకులపతి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంట నమోదుకు రేపు ఆఖరు

కమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):ఈ పంట నమోదు ఈకేవైసీ కోసం 6 వరకు అవకాశం ఉందని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె వంకమాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ పంట నమోదు వివరాలు ప్రతి రైతు సేవా కేంద్రంలో 7వతేదీ నుంచి 11వతేదీ వరకు ఉంచబడుతుందని తెలిపారు. వివరాల సవరణ కోసం మార్చి 13 నుంచి 18 వరకు తీసుకోబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.బాబు, రైతులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

వేంపల్లె, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):విజయవాడలో ఈనెల 6వ తేదీన ఎన్టీఆర్ కాలనీలో జరగబోయే బీసీవై పార్టీ శిక్షణ తరగతులను పులివెందుల నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని పులివెందుల ఇన్‌చార్జి నిర్మలయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. భవిష్యత్ కార్యచరణ గురించి చర్చించనున్నట్లు తెలిపారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప(వినాయకనగర్), మార్చి4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నిరాశ్రయుల వసతి గృహంలోని వృద్ధులకు మంగళవారం డాక్యుమెంట్ రైటర్ నూకబోయిన శివ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకబోయిన శివాయాదవ్ మాట్లాడుతూ ప్రతి తన తండ్రి తండ్రి గంగన్నయాదవ్ పేరుమీద వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో భరత్‌యాదవ్, చరణ్‌యాదవ్, ఆనంద్‌బాబు, శంకర్‌రెడ్డి, మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, శంకరాపురం రమణారెడ్డి, తిరుమలశెట్టి రఘురాం, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఎన్జీవో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు

కడప కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా జియోన్ కాలేజీలో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు మంగళవారం ముగిశాయి. టెన్నికాయిట్, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్, కబడ్డీ,వాలీబాల్ పోటీలను జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, రవికుమార్, మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నిర్మలా జ్యోతి, జిల్లా చైర్‌పర్సన్ శాంతమ్మ, కన్వీనర్, భారతీ కళాశాల ప్రిన్సిపాల్ రోడా మెర్సీ, నగేష్ ఆధ్వర్యంలో ఆటలపోటీలు జరిగాయి. విజేతలకు మహిళా దినోత్సవం నాడు బహుమతులు అందజేయనున్నట్లు ఆసంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్‌ను వినియోగించుకోండి

కమలాపురం రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ నిర్వహిస్తున్న సెప్టిక్ ట్యాంకు క్లీనర్ సేవలను వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ మార్పురి మేరీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు వారు నిర్వహిస్తున్న వాహనానికి ట్రిప్పునకు రూ.3వేలు వసూలు చేస్తున్నారన్నారు. కానీ నగర పంచాయతీ వారికి కేవలం రూ.2వేలు మాత్రమే చెల్లించి వాహనాన్ని వినియోగించుకోవచ్చని అన్నారు.

రాహుకాల దీప కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం

కడప కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గమ్మ ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకేతు పూజలు, అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకూ కాల సర్పదోష నివారణ పూజలు చేశారు. ఆలయంలో శుక్రవారం, పౌర్ణమి రోజులలో కూడా అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రతి నెలా రెండో ఆదివారం విజయదుర్గా-మల్లికార్జున స్వామివారి శాంతి కల్యాణం జరుగనుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆ తల్లి కృప కు పాత్రులు కావాలని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు.



రాహుకాల దీపాలను వెలిగిస్తున్న మహిళా భక్తులు

ఇంటిపన్నుల వసూళ్లు పూర్తి చేయాలి

● మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మార్చి చివరి నాటికి వంద శాతం ఇంటిపన్నులతో పాటు నీటి పన్ను వసూళ్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మున్సిపల్, రెవెన్యూ అధికారులు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ఇంటి పన్నులు, నీటి పన్నులు, పీజీఆర్ఎస్ దరఖాస్తులు, సచివాలయాల పనితీరుపై మానిటరింగ్‌కు నోడల్ ఆఫీసర్ల నియామకం గురించి చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అరియర్స్ బకాయిలు రూ.6.19 కోట్లు, కరెంట్ డిమాండ్ రూ.8.29 కోట్లు వసూలు చేయాలన్నారు. నీటి పన్ను రూ.4.53 కోట్లు వుందని, పన్ను కట్టని మొండి బకాయిదారుల కొళాయి కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాల పన్ను రూ.7.84 కోట్లు వుందని, ఇందులో ఎక్కువగా పోలీసుస్టేషన్లు, తహసీల్దారు కార్యాలయాలు వున్నాయన్నారు. వార్డు సచివాలయాల పనితీరు బాగాలేదని, సచివాలయాల్లో ఎవ్వరూ వుండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

స్త్రీ, పురుషుల సమానత్వానికి పోరాడాలి

● మహిళా, ఎన్జీవో సంఘాల నేతలు



ప్రొద్దుటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు స్త్రీ, పురుషుల సమానత్వానికై అన్ని రంగాల్లో పోరాడాలని చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్జీవో హోంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలో ఇప్పటికీ మహిళలు రెండవ పౌరులుగా ఉంటారన్నారు. విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లు సాధించినా ఇంకా పురుషులతో అన్నింటిలో సమానంగా చూడడం లేదన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో తాలూకా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, కార్యదర్శి సుబ్బరామయ్య, ఉమెన్‌వింగ్ చైర్మన్ జయమ్మ, ప్రమీల, జయంతి, మహిళా న్యాయవాదులు సిద్దేశ్వరి, మెహతాబ్, జనవిజ్ఞానవేదిక నేతలు ఉషారాణి, సునీత, రాయలసీమ మహిళా శక్తి కన్వీనర్ లక్ష్మీదేవి, జమాతే ఇస్లాం సభ్యులు రెహనా, హసీనా, చైతన్య మహిళా సంఘం పట్టణ కమిటీ నేతలు చంద్రావతి, క్రిష్ణ వేణి, మంగ పాల్గొన్నారు.

భూముల పరిశీలన

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణాన్ని, భూములు కోల్పోయిన రైతుల భూములను ఆర్డీవో చంద్రమోహన్ పరిశీలించారు. మంగళవారం ఆయన ఎరసాల ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారికి తప్పనిసరిగా నష్టపరిహారం అందుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖరెడ్డి రిటైర్డ్ తహసీల్దారు రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాలు పంపిణీ

ప్రొద్దుటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు దాతల సహకారంతో వస్త్రాలు అందజేసినట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో 178 మంది మున్సిపల్ రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ మహిళా పారిశుధ్య కార్మికులకు అందజేశారు. వీటిని వివేకానంద హోల్‌సేల్ వస్త్ర దుకాణాల అసోసియేషన్ విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నకేశవ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీతలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మైలవరంలోని బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశ పరీక్ష కొరకు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సావిత్రి మంగళవారం తెలిపారు. 5వ తరగతికి 80 సీట్లు, 8వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

స్థల విషయమై ఘర్షణ

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థల విషయమై జరిగిన ఘర్షణలో కొందరికి గాయాలు కావడంతో కడప రిమ్స్‌కు తరలించారు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1001 సర్వేనెంబరులో నివాసం ఉంటున్న ఎరుకల కులస్తులు, ఇతరులకు ఘర్షణ వాతావరణం జరిగింది. ఈ విషయమై తహసీల్దారు చంద్రశేఖర్ రెడ్డి ఆర్డీవోకు నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు.

మాలమహానాడు కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో నాలుగు మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు మండల అధ్యక్షులుగా కిరణ్, విజయరావు, విజయ్, రాజాలను ఎన్నుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ కార్యదర్శి ప్రసాదరావు, టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ఓబులేసు పాల్గొన్నారు.

కారు బోల్తా - తప్పిన ప్రమాదం

ముద్దనూరు మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన వీరు ప్రొద్దుటూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు టైరు పగిలి అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

మాకు అన్యాయం చేయకండి

● కమిషనర్‌కు వినతి అందజేస్తున్న సెక్రటరీలు

ప్రొద్దుటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేసే వార్డు ఎడ్యుకేషన్ డెటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు అన్యాయం జరుగుతుందని ఆ సంఘం నేతలు రవి కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు మంగ్లవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తాము భవిష్యత్తులో హాస్టల్ వార్డన్ పోస్టులకు కానీ ఇతర జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు గానీ అర్హత కోల్పోతామన్నారు. సచివాలయంలో కేవలం డెటా ప్రాసెసింగ్ ఆపరేటర్లుగా మాత్రమే మిగిలిపోతామన్నారు.

మైదుకూరులో పెద్దమ్మతల్లి దేవర

మైదుకూరు రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి పాతూరులో వెలిసిన పెద్దమ్మతల్లి దేవర ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడేళ్ల తరువాత జరగనున్న ఈ వేడుకల్లో ఈ నెల 21, 22వ తేదీల్లో చల్ల, 23న దేవర జరుగుతుందని, అనంతరం అంకాలమ్మ తిరుణాల కూడా జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వీఆర్వోపై రైతుల ఫిర్యాదు

దువ్వూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు వీఆర్వోగా పనిచేసిన రమణారెడ్డిపై తహసీల్దారు అక్బల్‌బాషాకు బుధవారం రైతులు ఫిర్యాదు చేశారు. పాస్‌బుక్కులు ఇప్పిస్తానని, భూములను ఆన్‌లైన్ చేయిస్తానని డబ్బులు తీసుకుని ఆ పనులు చేయకపోగా డబ్బులు వెనక్కు ఇవ్వమంటే పలకడం లేదని ఆరోపించారు.

ఆర్టీసీ ప్రయాణికుల లక్కీడ్రా

బద్వేలురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల - బద్వేలు రూటులో తిరిగే ప్రయాణికులకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను మంగళవారం ఆర్టీసీ డీఎం నిరంజన్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సమక్షంలో డ్రా తీశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంఈ శ్రీనివాసులు, కోఆర్డినేటరు ప్రసాద్, సుందరయ్య, భాస్కర్, శివారెడ్డి, చార్ట్ కంట్రోలర్ కేవీ రమణ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

ఎర్రగుంట్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నడిపూరులో అంకమ్మ (పార్వతిమాత) నూతన ఆలయ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. అంకమ్మతల్లి, గణపతి, సుబ్రమణ్య, సింహవాహనం, ధ్వజ, నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు తరలివస్తున్నారు. 6న శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు చెన్నకేశవరెడ్డి సోదరులు తెలిపారు.

లైన్‌మన్‌కు ప్రశంసాపత్రం

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల విద్యుత్ సబ్‌స్టేషనులో వినియోగదారులకు అత్యుత్తమ సేవలందించిన లైన్‌మన్ శ్రీహరి సుబ్బరాజు ప్రశంసాపత్రం అందుకున్నారు. మంగళవారం మైదుకూరులో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అందించారు. కార్యక్రమంలో ఈఈ భరణి క్రిష్ణ, డీఈ, ఏఈ పాల్గొన్నారు.

డివైడర్లలో వ్యర్థాలు వేయరాదు

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): డివైడర్లలో వ్యర్థ పదార్థాలు వేయరాదని సర్పంచ్ సుధాకర్ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని ప్రధాని రహదారిలోని డివైడర్ల మధ్యలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగించారు.

చిరుధాన్యాలతో ఫుడ్‌స్టాల్స్

కొండాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపురం, సుగమంచిపల్లె, తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కొండాపురంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపీడీవో నాగప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఎవో సుబ్బయ్య, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో ముంతాజ్ బేగం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని అంగన్వాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందారెడ్డి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్ఐ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు తూకాల్లో తక్కువ వస్తున్నాయని ఫిర్యాదు లందడంతో ఆయన మంగళవారం 5, 2 రేషన్‌షాపులను తనిఖీ చేశారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో మైదుకూరు-సింగరాయకొండ 167బీ జాతీయ రహదారి పనులను బీజేపీ నాయకులు నగేంద్ర, రమణాచారి, పండరి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జయరాం. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొండారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంటు సెల్ ఆధ్వర్యంలో సాధికారత గల మహిళ సామాజిక బాధ్యత పాత్ర అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డేవిడ్ మాట్లాడుతూ మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐ కొండారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు సులోచన తదితరులు పాల్గొన్నారు.

చెత్తను చెత్తబుట్టల్లోనే వేయాలి: ఎంపీడీఓ

ఎర్రగుంట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన చెత్తబుట్టల్లోనే ప్రజలు చెత్తను వేయాలని ఎంపీడీఓ వెంకటరమణయ్య సూచించారు. మంగళవారం హనుమనగుత్తిలో ఆయన పర్యటించారు. గ్రీన్ అంబాసిడర్స్‌కు ప్రజలందరూ సహకరించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మిల్లెట్స్‌పై ప్రజలకు అవగాహన

ప్రొద్దుటూరుఅర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మిల్లెట్స్ ప్రయోజనాలు, వాటి ఉపయోగాల గురించి ప్రజలకు, అంగన్వాడీ కార్యకర్తలకు సీడీపీవో హేమవతి అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక వైఎంఆర్ కాలనీ అరవింద ఆశ్రమం వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సూపర్వైజర్ ఆదిలక్షుమ్మ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం యోగాపై అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఐటీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్‌రవి తెలిపారు. మార్చి 1వ తేదీన చెన్నైకి చెందిన వీల్స్ ఇండియా కంపెనీ అప్రెంటీస్, ట్రైనీ ఉద్యోగాల కోసం పాలిటెక్నిక్ ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికల్లో కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి 4వ తేదీ ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.18 వేలు వేతనం లభిస్తుందని తెలిపారు. కాగా విద్యార్థులను ప్రిన్సిపల్, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులనే వాడాలి

గోపవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో పండించే ఆకుకూరలు, కూరగాయల వల్ల ఆరోగ్యానికి అధిక లాభమని ఎం.నాగరాజు అన్నారు. మండలంలోని చిన్నగోపవరం పీహెచ్‌సీ సెంటరు దగ్గర ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులైన ఆకుకూరలు, కూరగాయల స్టాళ్ల ద్వారా ఏర్పాటు చేసిన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మడకలవారిపల్లెలో వరిని పరిశీలించి సదరు రైతుకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.రామక్రిష్ణయ్య, కె.చంద్రమోహన్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు శివకుమార్, పవన్‌కుమార్, ఎం.సుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆడపిల్లల అభివృద్ధిని ఆకాంక్షిద్దాం

బద్వేలురూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు అరికట్టి ఆడపిల్లల అభివృద్ధిని ఆకాంక్షించేందుకు అందరూ ముందుకు రావాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మహిళా దినోత్సవ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు చంద్రవతి, హెల్త్ సూపర్‌వైజరు వెంకటమ్మ, జనార్ధనరావు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిల్వ ఆహారాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జమ్మలమడుగు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హోటళ్లలో నిల్వ ఉన్న ఆహారాలను విక్రయిస్తే చర్యలు తప్పవని కమిషనర్ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. జమ్మలమడుగు పాతబస్టాండులోని నాన్ స్టాఫ్ సర్వీసుల సమీపాన మంగళవారం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డితో పాటు స్థానికులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.